క్లుప్తంగా

పెరియార్ రామస్వామి పోరాటం స్ఫూర్తిదాయకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాస్తికుడు పెరియార్

ఏలూరు (టూటౌన్): ప్రజలందరికీ సమాన హక్కుల కోసం, స్త్రీ పురుష సమానత్వం కోసం, కుల నిర్మూలన కోసం అవిశ్రాంతంగా పోరాడిన పెరియార్ రామస్వామి పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ నాస్తికులు డాక్టర్ పెరియార్, సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తమిళనాడుకు చెందిన పెరియార్ రామస్వామి జయంతి కార్యక్రమాన్ని ఏలూరు స్ఫూర్తి భవన్లో ఏపీ హేతువాద సంఘం ఆధ్వర్యంలో కె.రామాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వాకాడ రాజారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, డి.రవికుమార్, కె.నరసింహం, డి.గంగాధర్ రావు, కె.సత్యనారాయణ మాట్లాడారు.

పోషణ మాసోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): పోషణ మాసోత్సవ కార్యక్రమాలను అంగన్వాడీ కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. వచ్చే నెల 16 వరకు పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి, కార్పొరేటర్లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైవేపై హోటల్లో వ్యభిచారం

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై రత్నాస్ హోటల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఏలూరు రూరల్ ఎస్సై బి.నాగబాబు సిబ్బందితో దాడి చేశారు. ఏలూరు ఆర్ఆర్పేటకు చెందిన ఎం సూరి అలియాస్ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా ఇతర ప్రాంతాల నుంచి యువతులను ఏలూరుకు తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దెందులూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులను కూడా ఆరెస్ట్ చేశారు. ఇద్దరు యువతులను సంరక్షణ గృహానికి తరలించారు. నిర్వహకుడు సూరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదుపు తప్పుతున్న ఆధ్యాత్మికత

- ఉత్సవాల్లో పెరిగిన డీజేల వినియోగం
- ప్రాణాలు తీస్తున్న శబ్దాలు
- 60 డెసిబుల్స్ శబ్దం మాత్రమే తట్టుకోగల చెవి
- నిషేధాజ్ఞల అమలు నామమాత్రమే



గణపతి ఊరేగింపులో డీజేల వద్ద నృత్యం చేస్తున్న యువకులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్పేట): ఆధ్యాత్మికత అదుపుతప్పుతోంది. ప్రశాంత వాతావరణం పంచాల్సిన ఆధ్యాత్మికత భక్తులతో పాటు ప్రజల్లో అసహనం పెంచుతోంది. ఉత్సవాల నిర్వాహకులు వినియోగిస్తున్న డీజేలు భక్తులను తారెత్తిస్తున్నాయి. వీటి నుంచి వస్తున్న మోతల దెబ్బకు ఆరోగ్యంగా ఉన్నవారి గుండెలు కూడా అదురుతున్నాయి. గుండె జబ్బులున్నవారు, వృద్ధులు, పిల్లలు ఈ ధ్వనులు భరించలేకపోతున్నారు. ఇటీవల ఏలూరు నగరంలో జరిగిన గణపతి ఊరేగింపుల్లో వినియోగించిన డీజేల కారణంగా గృహాల్లోని పాత్రలు కిందపడిపోవడం, గృహాలకు అందాన్నిచ్చే విధంగా చేయించుకున్న ఎలివేషన్ అద్దాలు పగిలిపోవడం అక్కడక్కడా సంభవించాయి. అలాగే గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఉత్సవ వేదికల వద్ద, నిమజ్జన ఊరేగింపుల్లో డీజేల వద్ద డ్యాన్సులు వేస్తూ ఆ ధాటికి హార్ట్ ఎటాక్కు గురై నలుగురు యువకులు మృతి చెందడం భక్తుల హృదయాలను కలిచివేసింది. ఈ నెల 22 నుంచి శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమౌతున్న నేపథ్యంలో మరోసారి అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పోటాపోటీగా ఉత్సవాలు

ఇటీవల వివిధ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సాహం చూపుతున్నారు. గణపతి నవరాత్రి మహోత్సవాలు, శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, శ్రీరామ నవమి మహోత్సవాలు పోటీపోటీగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీ తీవ్రస్థాయికి చేరుకుని పెద్దపెద్ద డీజేలు పెట్టి సందర్భానుసారం ఆధ్యాత్మిక గీతాలు వినిపిస్తున్నారు. ముఖ్యంగా గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఈ పోటీ వాతావరణం మరింత ఎక్కువగా కనిపించింది. రాబోయే శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను కూడా నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రాత్రి ఊరేగింపులు నిషేధం

రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము ఆరు గంటల వరకు భారీ ఊరేగింపులు పూర్తిగా నిషేధం.

80 డెసిబుల్స్ దాటితే ప్రమాదం

చెవి 60 డెసిబుల్స్ శబ్దం వరకు తట్టుకోగలదు. అంతకు మించితే అంటే 85 డెసిబుల్స్ దాటితే ప్రమాదకరంగా మారుతుంది. పగటి వేళల్లో నివాస ప్రాంతాల్లో 55 డెసిబుల్స్, వాణిజ్య ప్రాంతాల్లో 65 డెసిబుల్స్ వరకే పోలీసులు అనుమతిస్తారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలు, లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదు. ఆసుపత్రులు, విద్యాలయాలు, న్యాయస్థానాలు, ప్రార్థనా మందిరాలు ఉన్న ప్రాంతాల్లో డీజేల వినియోగానికి అనుమతి లేదు. డీజేలు పెట్టేవారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే శబ్ద కాలుష్యాన్ని అధిగమిస్తే ఆ లౌడ్ స్పీకర్లను, డీజేలను జప్తు చేసే అధికారం ఉంటుంది.

అనుమతి లేకుంటే జప్తు చేస్తాం



ఉత్సవాల నిర్వాహకులకు ముందుగానే డీజేల విషయంలో నియమనిబంధనలు గురించి అవగాహన కల్పిస్తున్నాం. డీజేల విషయంలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సి ఉంది. డీజేల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ పరికరాలను స్వాధీనం చేసుకుంటాం. నిర్వాహకులపై చర్యలు తప్పవు. డీజే సౌండ్ అధికం కావడం వల్ల ఎన్నో అనర్థాలున్నాయి. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా డీజేలు తక్కువ శబ్దాలతో ఏర్పాటు చేసుకోవచ్చు.

– డి.శ్రావణ్ కుమార్, డీఎస్పీ, ఏలూరు

శబ్ద కాలుష్యంపై రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని 2015లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినా అమలుకావడంలేదు. వేడుకల్లో భాగంగా వినిపించే సంగీతం వీనుల విందుగా ఉంటే అటు నిర్వాహకులకు ఇటు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటోంది. శృతి మించితే అనర్థాలకు దారితీస్తుంది. డీజేల వినియోగాన్ని అదుపు చేయాలని ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో కొంత అదుపులోకి వచ్చినా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఇటీవల గణపతి నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా విపరీతమైన శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను పోలీసులు వారించారు. అయితే వారు తమ ప్రాంత రాజకీయ నాయకుల ద్వారా స్థానిక ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి ఫోన్లు చేయించి డీజేలు కొనసాగించుకునేలా పంతం నెరవేర్చుకున్నారు.

గంగానమ్మ జాతర ఏర్పాట్లు పూర్తి



ఉత్సవ కరపత్రం విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్పేట): స్థానిక కొత్తపేట శ్రీ గంగానమ్మ జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ ప్రతినిధి త్రిపర్ణ రాజేష్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి, గౌరీ శంకర జానకిరామ సాయి మందిరంలో రాజేష్, అగ్గాల శ్రీనివాస్, అగ్గాల తాతారావు ఆధ్వర్యంలో కమిటీ జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. తాతారావు మాట్లాడుతూ అక్టోబర్ 5న ఆదివారం ఉదయం ఏడు గంటలకు పోతురాజు బాబు స్నాన సంబరాలు, అనంతరం మహిళా భక్తులచే నూటొక్క కలశాలతో నగర వీధుల్లో పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి అభిషేకం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. గంగానమ్మ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రెండు డివిజన్ల ప్రజలను కోరారు. సందర్భంగా ఉత్సవ కరపత్రం విడుదల చేశారు.

పేద వైద్య విద్యార్థులకు కూటమి అన్యాయం



చలో మెడికల్ కాలేజీ పోస్టర్లను విడుదల చేస్తున్న వాసుబాబు

గణపవరం: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం పేద వైద్య విద్యార్థులపై వేటు వేయడమేనని వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆరోపించారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఈ నెల 19న శుక్రవారం పార్టీ తలపెట్టిన చలో మెడికల్ కళాశాల ఆందోళన పోస్టర్ను విడుదల చేశారు. వైఎస్ జగన్ హయాంలో శరవేగంగా జరిగిన కాలేజీల నిర్మాణ పనులు కూటమి పాలన వచ్చాక చతికలబడ్డాయని విమర్శించారు. ఇప్పటికే ఐదు కాలేజీలు పూర్తికాగా, కొన్నింటిలో ద్వితీయ సంవత్సరం వైద్య విద్య తరగతులు నిర్వహిస్తున్నారని, కొన్ని దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఐతే పచ్చమీడియాలో కాలేజీల నిర్మాణమే ప్రారంభంకాలేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టేలా వార్తలు ప్రచురించిందని అన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ వాస్తవాలను ప్రజల ముందుంచాలని చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ అధ్యక్షులు దండు రాము, సంకుసత్యకుమార్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ కోడే కాశీ, కమ్మిల భాస్కర్రాజు, సూర్యబలిజ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి రాజా, నియోజకవర్గ బూత్ విభాగం అధ్యక్షుడు దండు గోపీరాజు, జీవీ, కొట్టు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో మెడికల్ కాలేజీ

దెందులూరు: వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఏలూరులో చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఏలూరు పాత బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ కాలేజీ వద్ద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అబ్బయ్య చౌదరి కోరారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్పేట): రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి తెలిపారు. స్థానిక సత్రంపాడు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. సంస్థలో శిక్షణ పొందుతున్న యువత రక్తదానం చేశారు. ప్రత్యేక అతిథి నీలాద్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తదానం చేయాలన్నారు. ఒక యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదని తెలిపారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం ఫణి కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రెడ్క్రాస్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం విచ్ఛిన్నం తగదు



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

టి.నరసాపురం: బొర్రంపాలెం ముత్యాలమ్మ మత్స్య సహకార సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలనుకోవడం తగదని మత్స్యకారులు అన్నారు. బొర్రంపాలెం ఎర్రకాలువ జలాశయం వద్ద ముత్యాలమ్మ మత్స్యకార సహకార సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు గుండె ధనరాజు, గుండె చిన చిట్టియ్య, బత్తుల రమేష్ తదితరులు మాట్లాడుతూ టీడీపీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, గండబోయిన శ్రీనులు మరో సంఘం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండో సంఘం ఏర్పాటుకు అంగీకరించబోమన్నారు. ఒక దశలో ఇద్దరు సభ్యులు తమకు చావే శరణ్యమంటూ ఒంటిపై డీజిల్పోసుకుని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని తోటి సభ్యులు వారించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

డ్వామా ఫైనాన్స్ మేనేజర్గా శ్రీదేవి



కలెక్టర్ వెట్రి సెల్విని కలిసిన శ్రీదేవి

ఏలూరు(మెట్రో): జాతీయ ఉపాధి హామీ పథకం ఏలూరు జిల్లా ఫైనాన్స్ మేనేజర్గా కంతేటి శ్రీదేవి గురువారం ఏలూరు జిల్లా కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. దెందులూరు ఎంపీడీఓగా పని చేస్తున్న ఆమెకు పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా శ్రీదేవి కలెక్టర్ వెట్రి సెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వట్లూరు అండర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?

సాక్షి టాస్క్ ఫోర్స్: వట్లూరు రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వట్లూరు దక్షిణాదిన ఎల్సీ గేట్ నంబర్ 343 వద్ద ఆర్వోబీ-25 2018లో ప్రారంభమైందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.11 కోట్ల అంచనాలతో రోడ్డు అండర్ బ్రిడ్జి ప్రాజెక్టును రూపొందించామని గుర్తుచేశారు. రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయించానన్నారు. టెండర్లు పూర్తయ్యాయని రైల్వే విభాగం పనులు పూర్తయ్యి ప్రస్తుతం ఎల్సీ బ్లాక్ కోసం వేచి ఉన్నారని తెలిపారు. మిగతా రూ.7 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, రూ.6 కోట్లు అప్రోచ్ రోడ్లు, ఒక కోటి భూసేకరణ కోసం అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రూ.5 కోట్లు మంజూరైనట్లు చెబుతున్నారన్నారు. ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చాయా లేక గతంలోని రైల్వే మంజూరులో భాగమా అని ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన నిధులు స్పష్టంగా మంజూరు చేయాలని ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు పూర్తి చేయడం అత్యవసరమని అబ్బయ్య చౌదరి అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారి మనోజ్ కుమార్తో ఈ విషయమే మాట్లాడానన్నారు. ఫిబ్రవరి 2024లో దెందులూరు – అలుగులగూడెం రైల్వే అండర్ పాస్ మంజూరు చేయించి, నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించామన్నారు.

చాటపర్రులో వైద్య పరీక్షలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో గురువారం 128 మంది మహిళలు, బాలికలు, గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల క్యాన్సర్, ఇతర పరీక్షలు చేశామని ఏలూరు జిల్లా ఇమ్యూనికేషన్ వైద్యాధికారి డాక్టర్ శోభ, చాటపర్రు పీహెచ్సీ వైద్యాధికారులు కృష్ణ, ప్రదీప్ చంద్ర తెలిపారు. మహిళలు, బాలికల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు స్వశక్తి నారీ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఎంపీహెచ్ఓ ప్రభాకర్రావు, సీహెచ్ఓ పావని, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్పేట): నగరంలోని పోణంగి 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పోణంగి గ్రామంతో పాటు పోణంగి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్ బియ్యం, వాహనంతో సివిల్ సప్లయిస్ అధికారులు

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెంలో గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 14 బస్తాల పీడీఎస్ బియ్యం వాహనంలో తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమాని చోడిశెట్టి సతీష్పై 6ఎ, 7(1) కేసు నమోదుచేసి జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్కు తరలించినట్లు సివిల్ సప్లయిస్ డీటీ జి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. దాడుల్లో సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల రణభేరి జాత

దెందులూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ బైక్ రణభేరి జాత నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్, రుద్రాక్షి అన్నారు. గురువారం మానూరులో వారు మాట్లాడుతూ ఈనెల 19న రణభేరి జాత ఉదయం 8 గంటలకు ఊటూరు మండలం నారాయణపురం హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమవుతుందన్నారు. భీమడోలు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి మీదుగా సాయంత్రం ఐదు గంటలకు ఏలూరు యూటీఎఫ్ కార్యాలయానికి చేరుకొని ముగింపు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు.

మాజీ సీఎం జగన్ను కలిసిన రామరాజు



మాజీ సీఎంను కలిసిన రామరాజు

దెందులూరు: మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో పార్టీ కొల్లేరు బీసీ రాష్ట్ర నేత రామరాజు, ఆయన కుమారుడు మోరు విజయ్ కలిశారు. తన నివాసం పై జరిగిన దాడి ముట్టడి దౌర్జన్యం, వేధింపులపై జగన్కు వివరించారు. పార్టీ అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారని రామరాజు తెలిపారు.

ఏనుగులకుంట భూమిని కాపాడండి

ఏలూరు (టూటౌన్): స్థానిక 47వ డివిజన్లో ఉన్న ఏనుగులకుంట భూమిని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని, కబ్జాదారుల నుంచి ఆ భూమిని కాపాడాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ కార్పొరేషన్ కమిషనర్కు గురువారం వినతిపత్రం అందజేశారు. 1971 నుంచి ఈ భూమి వివాదాల్లో ఉందని, దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి న్యాయస్థానాల్లో కేసులు పెడుతూ భూ కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. జిల్లా కోర్టు గతంలోనే ఇలా వేసిన కేసును కొట్టు వేసిందని, తిరిగి హైకోర్టులో కేసు వేసి ప్రజలకు ఆ భూమి ఉపయోగపడకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, సభ్యులు ఎం ఇస్సాక్ జె.గోపి, అరుణ కుమారి, మీసాల సత్యం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో 83,761 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామని, ఇంకా 29,512 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. వీటిలో 2660 మెట్రిక్ టన్నుల యూరియా, 4664 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4109 మెట్రిక్ టన్నుల మ్యూరియేట్ ఆఫ్ పోటాష్ (ఎంవోపీ), 12689 మెట్రిక్ టన్నుల ఎన్పీకే, 5390 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్పీ అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించకుండా రైతులకు అవగాహన కలిగించాలని వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు.

ఎంఈఓ కార్యాలయానికి పుస్తకాలు

దెందులూరు: ఏలూరు రూరల్, అర్బన్ మండలాలు సంబంధించి సెకండ్ సెమిస్టర్ క్లాస్ పుస్తకాలు 36 వేలు ఎంఈఓ కార్యాలయానికి వచ్చాయని ఎంఈఓ అరుణ్ గురువారం తెలిపారు. మండలంలో 120 పాఠశాలలకు ఈ పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు పంపామన్నారు.

20 నుంచి సాహిత్య, సంగీత మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్పేట): ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న ఆలపాటి రామచంద్ర రావు సాహిత్య, సంగీత మహోత్సవాలను విజయవంతం చేయాలని అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ కోరారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో వీటిని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాల కరపత్రాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు.

హుండీ ఆదాయం రూ.1.47 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్పేట): స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 42 రోజులకు రూ.1,47,519 ఆదాయం సమకూరిందని, 10 కెనడా డాలర్లు ఒక అజ్ఞాత భక్తుడు సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్స్పెక్టర్ సీహెచ్ ఉదయబాబు నాయుడు పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	బీర్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	40	కంద	00
కాకర కాయలు	34	బీట్రూట్	38
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	36	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	14	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	25
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	34